# గ్రంథి

వివిన మూర్తి



బిమల్ కోసం ఎదురు చూస్తోంది రామ్‌ప్యారీ.

ఆమె తనబంగ్లా పక్కగాపోతూన్న రోడ్డుకు అటూ ఇటూ నిద్రగన్నేరుచెట్లు నిద్రోతున్నట్టు అనుపించే ఆ రోడ్డుమీద ఎప్పుడయినా ఓ లారీ- అప్పుడప్పుడు ఎడ్లబళ్ళు కొద్దిపాటి మనుష్యులు. బంగ్లానూ, రోడ్డునూ విడదీస్తున్న వెదురుఫెన్సింగ్ మీద డిసెంబర్ పూలు- రోడ్డవతల కొంచెం దూరంలో ఏటిఒడ్డు- ఎటు చూసినా కొండలు!

ఎక్కడి ఉత్తరప్రదేశ్! ఎక్కడి ఆంధ్రప్రదేశ్!!

ఎక్కడి నైనిటాల్! ఎక్కడి తూర్పుగోదావరి!!

ఇంతదూరం ఎందుకు వచ్చింది తను? బిమల్.... బిమల్ కోసం!

బిమల్ భర్త అయినందుకా? కాదేమో. బిమల్ బిమల్ అయినందువల్లే- పెండ్లాడింది- అందుకే వచ్చింది. పచ్చని పసిమి పొడుగు గుండ్రని మొహం. చిన్నికళ్ళు అయితే ఏం? వాటిలో ఎంతబలం! ఎంతనవ్వు! లోకమంతా నాదే నాదే అనే ఎంతనమ్మకం! చూసేవాళ్ళలోనూ ఆ నమ్మకమే కలిగించే ఎంతగమ్మత్తు!

రామ్‌ప్యారీకి ఈ ఊరుకూడా బాగా నచ్చింది.

"రాత్రి చెమ్మను పీల్చుకుని పగళ్ళు చల్లగా ఉండే నైనిటాల్ ఎక్కడ? పగటివేడిని నింపుకుని రాత్రిళ్ళుకూడా వేడిగా ఉంటుందని వినే దక్షిణ భారతం ఎక్కడ? బిమల్! నేను నీ కోసం ఏద్దయినా భరిస్తాను-" అనే ప్యారీ మొదట్లో అనుకుంది.

కానీ-ఎదురుగా ఏటిఒడ్డు పురాతన దేవాలయం! దానిమీద పావురాలు! చెట్ల మీద చిలకలు! చెక్కిన బొమ్మల్లాంటి మనుష్యుల శరీరాలూ! కొండలమీద సభ తీర్చే మేఘాలూ! - అన్నీ రామ్‌ప్యారీకి ముచ్చటగానే ఉన్నాయి.

అదిగో! ఆ విజిల్! ఆ హమ్మింగ్!

చట్టునలేచి గేటుదాకా పరుగెత్తింది.

గేటుముందు ఆడుకుంటున్న పిల్లలు మనిషి అలికిడిసోకిన పక్షుల్లా ఎగిరి పోయారు. కొంతదూరం పోయి నించున్నారు! వాళ్ళకు ఆమె దుస్తులూ, ఆమె తెలుపూ, జుత్తుపద్ధతి గమ్మత్తుగా ఉన్నాయి.

"ఏం- యింతాలస్యం-?" భర్త భుజం పట్టుకుంది.

"ఫ్యాక్టరీలో చిన్న బ్రేక్‌డవున్ వచ్చింది- ప్యారీ!"

వాళ్ళిద్దరూ లోపలకు నడపగానే పిల్లలు అడుగూ అడుగూ వేసుకుంటూ వచ్చారు వెదురు ఫెన్సింగ్ కంతల్లో కళ్ళుపెట్టి చూస్తున్నారు.

చేతిలోని "రూట్స్" పుస్తకం అందించాడు బిమల్.

తిరగేస్తూ కుర్చీలో కూర్చుంది ప్యారీ.

స్నానం పూర్తిచేసుకువచ్చేసరికి ఆమె యిరవయ్యో పేజీలో ఉంది బిమల్ పెద్ద గొంతుతో- టూటీ పువే ఖావేం- అంటూ అరుస్తూనే ఉన్నాడు.

బిమల్‌తో ఫలానీలా ఉంటుందని ఆమె అనుకోలేదు. అదో సుడిగాలి. అదో మహాప్రవాహం! సెలవులకి నైనిటాల్ వచ్చాడతను. తమ తండ్రులిద్దరూ బాల్య స్నేహితులట. అలా పరిచయమయాడు బిమల్ అప్పటికే రామప్యారీ ఫిలాసఫీ ఎమ్మే చేసింది. బిమల్ షుగర్ టెక్నాలజీలో డిగ్రీ తీసుకున్నాడు అతని గొంతు స్నేహంగా ఉంటుంది. విషయాలు చెబుతున్నపుడు అతని కళ్ళు గొప్పసత్యాలు వివరిస్తున్నట్టు గర్వంగా ఉంటాయి.

"అంతదూరంలో ఉద్యోగం చేస్తున్నావేం-?"

"మరెక్కడా దొరక్క-"- అంటాడనే భావించింది

"దేశమంతా చూడాలి. దేశాన్ని చదవాలి

డబ్బు సంపాదన ఒక్కటే ఆనందమిచ్చేటంత పేదమనుష్యులుంటారని ఆమె తన తండ్రినిచూసి గ్రహించింది.

మూడురోజులూ బిమల్ అలా మాట్లాడుతూనే వున్నాడు.

రామ్‌ప్యారీ విభ్రమంతో వింటూనే ఉంది

అతనికి అనేకం తెలుసు!

మనుషుల స్వభావాలగురించి బిమల్ చెపుతూంటాడు అతని పరిశీలనకు లోతున్నట్టు ఆమెకు అనిపించలేదు. వైశాల్యం ఉన్నట్టుగా ఆమెకు తోచింది.

అభిప్రాయాలు గలవాళ్ళు హృదయంగలవాళ్ళుగా రామ్‌ప్యారీ అనుకుంది.

"నిన్ను పెళ్ళాడే అవకాశం- నాకు దొరుకుతుందంటావా?"

"నాకు వివాహంమీద నమ్మకం లేదు-"

"వ్యక్తుల నమ్మకాలమీద వివాహం ఆధారపడి వుండదు రామ్‌ప్యారీ!"

"మరి... ?"

"అది సాంఘికపరమైన ఏర్పాటు."

"దాని రూపాన్ని మనం మార్చలేమంటావా?"

"అవసరమయినపుడల్లా అది మారుతూనే వచ్చిందిగదా..."

బిమల్‌తో వివాహానికి పెద్దలు అనుమతించారు. పోస్ట్‌గ్రాడ్యుయేట్‌ని చేసుకోవాలి- అంది తల్లి రామ్‌ప్యారి ఒప్పేసింది...

బిమల్ ఫోంచేస్తున్నాడు. గబగబా ఓ చపాతీ తిని-

"నీకు తోచుతోందా...."

గెడ్డంకింద చెయ్యి పెట్టుకుని టేబిల్ మీద మోచేతిని ఆన్చి ప్యారీ తదేకంగా చూస్తోంది.

"ఏంటలా చూస్తున్నావ్....?"

ఫక్కున నవ్వింది.

"ఎందుకానవ్వు....!"

ప్యారీ ఎక్కువ మాట్లాడదు. వింటుంది. బిమల్ ఎక్కువ మాట్లాడతాడు. వినడు. ఇంతలో-

నౌఖరు రంగయ్య వచ్చి సలాంచేసి తెలుగులో ఏదో అన్నాడు. పదేళ్ళుగా బిమల్ అక్కడ ఉంటున్నాడు. అతను తెలుగు మాటాడుతుంటే తనమైనా తనకు అర్థంకాని తీయని పదాలేవో అంటున్నట్టుంటుంది.

రంగయ్య మళ్లీ ఏదో అన్నాడు.

బిమల్ ఒక్కమారుగా లేచాడు. పెద్దగా అరుస్తూ రంగయ్యమీదకు వెళ్ళాడు. రంగయ్య ఓ అడుగు వెనక్కి వేసాడు. గబగబా ఏదో అన్నాడు. చేతిలోని చపాతీ ముక్కను నోట్లో వేసుకుని ఓ చేయి బిగించి రెండో అరచేతిలో గుద్దుకుంటూ విన్నాడు. రంగయ్య మాటలయిపోయాక కొంచెంసేపు అటూ ఇటూ తిరిగాడు బిమల్ గబగబా వెళ్ళి తన పర్సు తీసాడు. అందులోంచి రెండు వందనోట్లు తీసి రంగయ్యమీదకు విసిరాడు.

అవి అందుకుని సలాంచేసి వెళ్ళిపోయాడు రంగయ్య.

కొన్ని సెకన్లలోనే మామూలుగా మారిపోయి- టూ దే హంవే ఖాబేం- అంటూ రఫీకి అన్యాయం చేయటం మొదలుపెట్టాడు.

ఇదంతా ఓ సినిమాలా అనిపించింది రామ్‌ప్యారీకి, తనే అడిగి తెల్సుకుందా మన్న కుతూహలాన్ని ఆమె కొద్దిశ్రమతో అణుచుకుంది. ఎందుకో ఆమె విశద పరచుకోలేకపోయినా ఈ అయిదునిమిషాల బిమల్ ఆమెకు నచ్చలేదు.

బిమల్ ఏదో సర్దార్జీ జోకు చెప్పాడు.

అవివేకం చాలా బాధాకరమైనదే! అయితే అది నవ్వుతూ చెప్పినపుడు. రామ్‌ప్యారీ చాలా హాయిగా నవ్వేసింది. "తో కె పరావా నా బోంబే [illegible] హై-" అంటున్నప్పుడు బిమల్ పంజాబీ యాసతో చాలా సహజంగా అన్నాడు.

ఎదుటివాడిది అవివేకమని గుర్తించగలిగిన వివేకం- దానిపట్ల [illegible] తప్ప నవ్వకూడదనే వివేకం ఎందుకు యివ్వదూ? అంటూ ఆ తర్వాత చాలా [illegible]ధించింది రామ్‌ప్యారీ!

మరుసటిరోజు మధ్యాహ్నం రెండుగంటలు.

బిమల్ ఫోంచేసి అప్పుడే వెళ్ళిపోయాడు. గేటుదాకా సాగనంపి అక్కడే

నిలబడింది ప్యారీ! మనసునిండా బిమల్ కబుర్లూ- రూట్స్‌లో నీగ్రోల శిక్షణా పద్ధతీ- ఓదానితో ఒకటి సంబంధం లేకుండా దాగుడుమూతలు ఆడుతున్నాయి.

ఓ కుర్రాడు వచ్చి ఆమెకు కొంచెం దూరంలో నించున్నాడు.

ప్యారీ చూపు వాడిమీద నిలిచింది.

వాడు తదేకంగా చూస్తున్నాడు. ఆమె కదిలేచాలు- తుర్రుమని పారిపోటానికి తయారుగా ఉన్నాడు. ఒళ్ళంతా మట్టికొట్టుకుని వుంది. చాలామంది పిల్లలకి లా అంటకత్తెరగానీ గుండుగానీ లేవు వాడికి. ఉంగరాల జుత్తూ తెల్లని శరీరఛాయతో వాడు భిన్నంగా అవుపిస్తున్నాడు.

రెండురోజులుగా వాడినే చూస్తోంది ప్యారీ.

రమ్మని చెయ్యి ఊపుతుంది. రాడు. అక్కడనించిపోడు. ఓ అడుగు వాడి వేపు వేస్తేచాలు- నాలుగు అడుగులు పరిగెత్తిపోయి చూస్తూ నిలబడతాడు.

పట్టుదలగా వాడివేపు చూస్తున్న ప్యారీ గబుక్కున లోపలకు పరుగెత్తింది.

తిరిగివచ్చి చేతిలో జిలేబీని చూపిస్తూ స్నేహపూర్వకంగా నవ్వింది.

వాడినుంచి జవాబులేదు.

గేటు వెదురుకర్రకు దాన్ని తగిలించి వెనక్కినడిచింది. వాడు ఓ అడుగు ముందుకు వేసాడు. ఆమెమరింత వెనక్కిపోయి వరండాలో నిలబడింది. వేగంగా వచ్చి జిలేబీని పట్టుకు పరుగెత్తపోయాడు. ఎటునించో ఓ కాకి రివ్వునవచ్చి ఆ చేతిలోని జిలేబీని తన్నుకుపోయింది. దాని ముక్కు గుచ్చుకుంది. కిల్లు పెట్టాడువాడు.

ప్యారీ ఆమెవెనకే చౌకీదారూ పరుగెత్తారు.

కొద్దిగా రక్తంకారుతోంది. ముగ్గువేసి కట్టుకట్టాడు చౌకీదారు.

జిలేబీలతో ప్లేటు తీసుకువచ్చింది. వాడికి అందించింది. ఆబగా తింటున్నాడు.

ఇంతలో బిమల్ గేటుదగ్గరకు వచ్చాడు వరండాలో ఆ కుర్రాడిని చూస్తూనే పిచ్చెత్తినట్టుగా ఓ వెదురుకర్ర ఊడబెరికి పరుగెత్తాడు. ఎవరూ అదిగమనించలేదు. చేతిలోకర్రతో రెండు దెబ్బలు వేసేసరికి కుర్రాడు ఏడుస్తూ అటూ యిటూ పరుగెత్తాడు.

షాక్‌నించి తేరుకున్న ప్యారీ- అతనిచేతిలో కర్రను లాక్కుని విసిరేసింది. చౌకీదారు ఆ కుర్రాడిని ఎత్తుకుని గేటువేపు నడుస్తుంటే బిమల్ తెలుగులో ఏదో అరుస్తున్నాడు.

ప్యారీవేపు చూడకుండా లోపలకువెళ్ళి మరిచిపోయిన కాగితాలను తీసుకున్నాడు, ఒక్కమాట మాట్లాడకుండా వేగంగా బయటకు వెళ్ళి పోయాడు బిమల్.

వరండాలో కుర్చీలో కూర్చుంది ప్యారీ-

అరగంట తర్వాత చౌకీదారు తిరిగివచ్చాడు. పుస్తకం లోంచి ప్యారీ బయటకు రాలేదు. అయిదయాక బిమల్ వచ్చాడు. చాలా సంతోషంగా ఉన్నాడు. ఫ్యాక్టరీలో చిన్న ఏక్సిడెంట్ జరిగిందిట. కాంపెన్సేషన్ విషయంలో పెద్ద మొత్తం నష్టం రాకుండా సర్దేశాడుట

ప్యారీకి అతను సమర్థుడనిపించింది

అయిదున్నర గంటల ప్రాంతంలో కొంతమంది మనుషులు చిన్న గుంపుగా వచ్చారు. వాళ్ళ చేతుల్లో కర్రలున్నాయి. ముఖంలో కోపాలున్నాయి. బిమల్ కన్నముందు రంగయ్యా, చౌకీదారూ వాళ్ళ దగ్గరకు వెళ్ళారు. వాళ్ళు తిరిగివచ్చి ఏదో చెప్పాక బిమల్ కదిలాడు.

కిటికీలోంచి చూస్తోంది ప్యారీ.

ఓ ముసలి మనిషి బిమల్ని ఏదో అంటున్నాడు. బిమల్ ఉన్నట్టుండి అంత కన్న కోపంగా అరిచాడు. ఓ లావుపాటి మనిషి, కలుగ జేసుకుని ఏదో అంటున్నాడు. రంగయ్య బిమల్నీ అతన్నీ దూరంగా తీసుకువెళ్ళాడు. 'కాదు కాదు' అంటున్నట్టుగా ఆ లావుపాటిమనిషి బుర్ర ఊగుతుంది. చివరకి బుర్ర ఊగడం ఆగింది. జేబులోంచి కొన్ని పదినోట్లుతీసి అతనికి యిచ్చాడు బిమల్.

వాళ్ళు వెళ్ళిపోయారు.

ఆ సాయంత్రం బిమల్ కోరికమీద ఏటి ఒడ్డుకు వెళ్ళింది.

ఆరబెట్టిన బట్టలు చుట్టబెడుతున్నారు. చాకళ్ళు. చెలమలలోని నీరు కావిళ్ళతో మోసుకుపోతున్నారు. ఒడ్డుఎక్కలేని బండిని కొందరు చక్రం పడుతున్నారు. గేదెలను గడ్డితోతోమి కడుగుతున్నారు.

అన్నీ చూస్తోంది ప్యారీ.

వదలకుండా మాట్లాడుతూనే వున్నాడు బిమల్.

సాయంకాలపు సూర్యుడి ఎర్రదనాన్ని విసురుతోంది ఆకాశం.

అతని చెణుకులకి ఆకస్మాత్తుగా అసందర్భంగా నవ్వేసాగింది ప్యారీ. గమనించనట్టుగా అతను నైనిటాల్నూ ప్రథమ పరిచయాన్నీ గుర్తుచేస్తున్నాడు బిమల్

ఆ రాత్రి మంచం దగ్గరకి బిమల్ వచ్చేసరికి నిద్రపోతూన్నట్టుగా పడుకుని వుంది ప్యారీ. రెండు మూడు పిలుపులకి జవాబులేదు. తిరిగివెళ్ళి తన మంచం మీద పడుకుని తలగడ కొంచెం పైకిలాగి సిగరెట్ ముట్టించాడు.

పెట్టిఖాళీ అయాక అతను నిద్రపోయాడు.

ప్యారీకి కిటికీ అవతల ఆకాశంలో చుక్కల లెక్క తేలలేదు.

ఆ మరుసటి రోజంతా కుర్రాడి జాడలేదు.

తర్వాత ఉదయం ఎనిమిదికి బిమల్ వెళ్ళిపోయాడు. ఉదయం ఫలహారం పూర్తి చేసుకుని శుభ్రమయిన బట్టలు వేసుకుంది. ఎర్రటి ఊలు కండువా భుజాల మీంచి కప్పుకుంది.

చౌకీదారుని పిలచింది.

ఆమె హిందీ అర్థంకానట్టు కాసేపు నటించాడు. 'సాబ్' కోప్పడతారనీ కొంతసేపు నసిగాడు చివరకి ప్యారీ ఆజ్ఞ పాలించాడు

ఊరు మొత్తం జనాభా అయిదువేలు,

ముఖ్యమయిన వీధులు మూడు. మిగిలినవన్నీ సందగొందులే!

చౌకీదారు వెనకే నడుస్తూన్న ఆమెను చాలామంది వింతగా చూస్తున్నారు ఉత్తరప్రదేశ్‌లోని గ్రామాలతోనయినా ఆమెకు అంతగా పరిచయం లేదు అయినా ఆమె ఆ జనం చూపులని అర్థం చేసుకోగలిగింది. పెద్దవాళ్ళకు చిన్నవాళ్ళపట్ల కలిగే జాలి ఆమెకు వాళ్ళపట్ల ఏర్పడింది.

అది ఓ మట్టిగుడిసె, చుట్టూ పవిత్రంగా ఉంది. పచ్చమన్నుతో మెత్తిడిన్న చిన్న అరుగుమీద ఓ ముసలతను కూర్చుని ఉన్నాడు. అతన్ని ఆమె గుర్తుపట్టింది వాళ్ళను చూడగానే అతను లేచి నించున్నాడు. చేతిలో చుట్టను పక్కన పెట్టేసాడు. వినయంగా చేతులు జోడించాడు.

గుప్పున వాసన.

ఆమె ఇబ్బందిని గ్రహించి కాస్త వెనక్కి అడుగువేసాడు

గుడిసెలోపల అంతగా వెలుతురు లేదు. గోనెగుడ్డలమీద పాతబట్టల పక్క మీద ఆ కుర్రాడు పడుకుని ఉన్నాడు. కొంచెందూరంలో మట్టిపొయ్యిమీద ఏదో ఉడకపెడుతున్న ఆ కుర్రాడితల్లి కంగారుగా వచ్చి ప్యారీకి నమస్కరించింది.

దాదాపు రెండుగంటలసేపు అక్కడే ఉంది ప్యారీ.

కుర్రాడికి బాగా జ్వరంగా వుంది. ఊళ్ళోఉన్న ఓ పి ఎమ్ పి డాక్టరుని తెచ్చాడు చౌకీదారు. ఇంజక్షన్‌చేసి కొన్ని బిళ్ళలు యిచ్చాడు ప్యారీ డబ్బుయిచ్చింది వచ్చిరాని యింగ్లీషులో ఆ కుర్రాడికేం ఫరవాలేదన్నాడు డాక్టరు అతను ప్రాణరక్షకుడిలా మాట్లాడటం గమనించింది ప్యారీ. ఆ కుర్రాడి ఒళ్ళంతా వేడినీటిగుడ్డతో తుడిపించింది. ఆ కుర్రాడితల్లి ఆమెకు ఓ చెక్కపెట్టెను ఆసనంగా అమర్చింది

ఆ అడమనిషి తనకన్న వయసున్నదానిలాకనిపిస్తోంది ప్యారీకి. ఆమె రవిక వేసుకుంది. అది ఆమెకు అలవాటు లేనిదన్నట్టూ అమరనట్టూ ప్యారీకి తోచింది.

తిరిగి రామ్‌ప్యారీ వచ్చేసరికి బిమల్ బంగ్లాలో ఉన్నాడు.

ఇద్దరూ కలిసి పూరీ సబ్జీ తిన్నారు.

కొంతసేపు ఎప్పుడూ లేనంత మౌనంగా ఉన్న బిమల్ ఏదో గుర్తు వచ్చినట్టు మాటాడటం మొదలుపెట్టాడు.

మానవజాతికి అపకారంచేసే స్వభావాలలో దొంగతనంఒకటి కలిసి జీవించే మనుషులమధ్య హద్దులుంటాయి. వాటిని గుర్తించటం, దాటకపోడం అవసరం. దాటే ప్రయత్నమే- ఎదుటివ్యక్తి నష్టపోతాడనీ హక్కులన్ తీసుకోటం అదే దొంగతనం- ఇలా మాట్లాడుతూనే అతను ఓ సర్దార్జీ జోకు చెప్పాడు అందులో సర్దార్జీకి స్వపరభేదంలేదు. అది ఎందుకు మొదలుపెట్టాడూ- అన్పించింది ప్యారీకి

ఓ ముక్క అర్థమవలేదు ఓ నవ్వు నవ్వలేదు. ఓ మాట పలకలేదు ప్యారీ

ఎందుకూ- అని బిమల్ అడగలేదు.

ఆ సాయంకాలం హరిలాల్ ఓ వింత విషయం చెప్పాడు చెరుకుతొక్క తీయ

టంలో పెదిమలు కలిసేచోట తెగింది. పళ్ళు నొప్పిపెట్టాయి.

ఆ రాత్రి ఆమె ఆహారం సరిగా తినలేకపోయింది.

డైనింగ్ టేబిల్‌నుంచి సరాసరి వెళ్ళి పుస్తకంలో మునిగిపోయింది.

పదకొండవుతోంది. బిమల్ వచ్చి మృదువుగా ఆమె భుజంమీద చేయి వేసాడు "ఇంక పడుకోవా-?" ప్యారీ అతనివైపు చూసి- చాల ఇంట్రస్టింగ్‌గా ఉంది "

ఒంటిగంట ప్రాంతంలో మళ్ళీ పలకరించాడు,

"రూట్స్ నిన్ను బాగా మూవ్ చేస్తుందనుకుంటాను..."

జవాబుగా నవ్వింది ప్యారీ-

ఒంటిగంటా యిరవైకి సిగరెట్లకోసం వెదికాడు బిమల్ లేవు.

లేచివచ్చి ఓ కుర్చీ లాక్కుని ఆమెముందు కూర్చున్నాడు

"నీతో కొద్దిగా మాట్లాడాలి ప్యారీ...."

పుస్తకం మూయకుండానే "చెప్పూ" అన్నట్టు చూసింది

"పుస్తకం నీకు బాగున్నట్టుంది- నిన్ను డిస్టర్బ్ చేస్తున్నానా?"

"ఉదయం మాట్లాడుకోవచ్చేమో....?"

"మనసు విప్పుకోటానికి- రాత్రి సమయం బావుంటుంది...."

పుస్తకం మధ్య ఓ పేకముక్కను ఉంచింది. దాన్ని మూసి షెల్ఫ్‌లో ఉంచి వచ్చింది వరండాలో కుర్చీలు వేసాడు బిమల్. వాతావరణం చల్లగా ఉంది.

"నువ్వు ఉదయం చూసిన స్త్రీతో నాకు శారీరక సంబంధం ఉండేది. ఆమె తండ్రి ఇక్కడ చౌకీదారుగా ఉండేవాడు. వాళ్ళిద్దరూ ఔట్‌హౌస్‌లో ఉండేవాళ్ళు. ఒంటరితనం చిన్నవయసు... అమాయకత్వం.... నీకూ తెల్సుగదా- వాళ్ళు బీదవాళ్ళు ఆ ముసిలాడు తాగుబోతు నాకు ఆమెతో ఉన్నది కేవలం శారీరక సంబంధం- నీవూ వూహించగలవనుకుంటాను- ఇందులో 'తప్పు' కన్నా బలహీ రృత ఎక్కువ నీవూ అర్థంచేసుకోగలవు-"

ప్యారీ మొహంలోకి తలతిప్పి చూసాడు బిమల్.

అందులో మార్పు అతను ఊహించినట్లుగాలేదు. వేగంతో దాపరికలు తోప్పు లేని వాళ్ళా ఉన్నాడు బిమల్.

"ఏమయినా అడుగూ-"

"చెపుతున్నాన్‌గదా...."

"మనమధ్య నున్నది అలౌకికమనీ అభౌతికమనీ నేను అనటంలేదు. మన మధ్య బంధం ఏ రకమైనదో యీ సంబంధం ఆ రకమయినది కాదని చెప్పగలను. ఈ రెంటిమధ్యా పోలిక చేయటం కుదరదు. సబబుకాదు. ఇందులో ఏది బలమయినదో ఏది శాశ్వతంగా ఉండే అవకాశం వుందో- నువ్వూ గ్రహించగలవు-"

" ....."

"నా పరిస్థితి నీకు అర్థమయిందనుకుంటాను-"

"ప్రయత్నిస్తున్నాను"

వారం రోజుల తర్వాత ఆ రాత్రి కొద్దిగా వానపడుతోంది

విమల్ నిద్రపోతున్నాడు. ప్యారీ అతని మొహంలోకి [illegible] చాలా ప్రశాంతంగా ఉంది. నుదురు పచ్చగా ఉంది. దట్టంగా [illegible] వంగి అతని మొహంలో వెదుక్కుంటున్నట్లుగా చూసింది. మరికొద్దిగా [illegible] పెదాలు సన్నగా కంపిస్తున్నాయి. మరికొద్దిగా.... యింకొద్దిగా....

తాకీ తాకనట్లుగా.... ఓ చిరుచుంబనం....

పెదాలు భగ్గున మండినట్లు.... వీపున కొరడాతో ఛెళ్ళున కొట్టినట్లు.... పరుగెత్తింది

బుక్ షెల్ఫ్‌లో చేతికి దొరికిన పుస్తకం అందుకుంది. మామ్ కథలు!

స్విచ్ ఆఫ్ చేసింది. నీలం కాంతి పరుచుకుంది.

వెనక వరండాలో పడకకుర్చీలో వాలింది లైట్ ఆన్‌చేసింది. రీడింగ్ బల్బ్‌కాంతి ఆమెమీద వర్షిస్తోంది. చేతిలో పుస్తకం గుండెలమీద ఉంచుకుని బయటకు చూసింది

మెరుపులేదు! ఉరుములేదు! సన్నగా వాన!- మెత్తని చప్పుడు! పెరట్లోని ఆకాశమల్లిచెట్టు రాకాశిలా ఉంది. బంగ్లా ముందువేపు రోడ్డుమీద యిరుసుకు నారలేని ఏదోబండిచక్రాల చప్పుడు వికృతమైన రోదనలా వినిపిస్తోంది. చిన్నదిగా మొదలై క్రమంగా పెద్దదై చివరకి నిశ్శబ్దంలో పూర్తిగా కలిసిపోయింది ఆ ధ్వని. అంసకల్పితంగా ఆ శబ్దం కోసమే యత్నిస్తున్న చెవులకు అది యింకా వినిపిస్తున్న భ్రమ అలాగేవుంది. క్రమంగా ఆ భ్రమ చెదిరిపోయింది.

మామ్ కథల్లో ఒకటి చదవటం మొదలు పెట్టింది ప్యారీ.

మూడు పేజీలు గడిచేసరికి మామ్ ఆమెను తనలో యిమిడ్చేసుకున్నాడు. అందులో కథ తనదే! ఆ హీరోయిన్‌ది దాదాపు తన పరిస్థితే! చివరకి ఆమె భర్తను విడిచిపెడుతుంది. ఆమె "చర్య" రామ్‌ప్యారీకి మింగుడుపడలేదు.

పెన్నూ కాగితాలూ తీసుకుంది.

"రాతి నిశ్శబ్దం" ఆమె అంతరంగాన్ని అక్షరాలుగా చెక్కుతోంది మధూ బెహన్!

ఒక్క ముక్కలో చెప్పాలంటే- విమల్‌కు యింతకుముందు ఓ స్త్రీతో సంబంధం ఉంది ఫలితంగా ఓ కొడుకున్నాడు ఆమె ధనికురాలుకాదు సంస్కార వతికాదు- అందువల్ల ఆమెతో సంబంధం శారీరకమయినదీ- అంటాడు విమల్ అందువల్లే అది శాశ్వతమయినది కాగూ- అనీ అంటాడు

ఇదంతా అతనుచెప్పి వారమయింది

అది వింటునప్పుడు నాస్థితి ఏమిటీఅంటే- నా మెదడు దాదాపు పనిచెయ్య లేదు ఏ ఆలోచనాలేదు అలాంటి మూర్ఖత్వంలో యింతకు ముందు ఎప్పుడూ ఉన్న

గుర్తులేదు మూడుగంటలకు మించే ఉండాల్సి ఆ తర్వాత నా శరీరాన్ని నేనే దూరంనుంచి చూస్తున్నట్టు అనిపించింది. రంగురంగు దుస్తుల్లో ఒక్కోసారి.... జుత్తు విడిపోయి ఓ మారు.... దేదీప్యమానమయిన కాంతులు లోపల్నుంచి విరజిమ్ముతూ వున్నట్టు ఒక్కోమారు.... గాల్లోకి ఎగురుతున్న నన్ను నేనే పట్టుకోటానికి పరుగెత్తుతూన్నట్లు.... క్రమంగా ఆ స్థితిలోంచి నేను నిద్రలోకి జారుకున్నాను. ఈ స్థితి ఎంతసేపో నేను చెప్పలేను.

ఈ వారంలో నాకు చాలా ఆలోచనలు వచ్చాయి.

అందులో చాలాభాగం- నేనిప్పుడేం చెయ్యాలి-?- అన్నదానిమీదే వచ్చాయి. బిమల్ అనే ఓ ప్రాణి ఈ యింట్లో నాతోబాటు నివసిస్తున్న విషయం అయిదురోజుల దాకా నేను పట్టించుకోలేకపోయాను. రెండురోజులుగా అతన్ని నేను బాగా గమనిస్తున్నానని పిస్తోంది. అతను ఎలా ప్రవర్తిస్తున్నాడు-? ఏ మనుకొంటున్నాడూ-? ఈ కుతూహలం నాలో ప్రవేశించిందను కుంటాను అతను నన్ను డిస్టర్బ్ చెయ్యాలనుకోవటం లేదు. "తప్పు" చేసానన్న భావన కనపడటం లేదు. "నష్టం" జరగబోతూందన్న భయమే- కాబోలు- కనపడుతోంది పూర్వంలా ఉత్సాహంగా లేడు- ఇలా నేను గమనించాను. "తప్పు" చేసానని ఎందుకనుకోడు? నన్ను డిస్టర్బ్ చేయకుండా మర్యాదగా ప్రవర్తిస్తే- నేను మన్నిస్తాననుకుంటున్నాడా? నేను మన్నించేస్తే అతని "తప్పు" మాసిపోతుందా-? తప్పంటూ అతను చేసాక అతనికి 'నష్టం' జరగరాదా-? అతని "తప్పు" నాకు తెలియకపోతే ఉషారుగా యీలలువేస్తూ పాటలు పాడుతూ ఉంటాడా? తెలిసాక నోరు మూసేసుకుంటాడా-? ఇలాంటి ప్రశ్నలు అతన్ని గమనిస్తూంటే కలుగుతున్నాయి.

"నేనేం చెయ్యాలి-?" అన్నప్రశ్న, "నేనేం చేయగలనుగా-" మారిపోయింది. ఎప్పుడు అలా మారిందో స్పష్టంగా నేను గుర్తించలేకపోయాను. ఇలా మారాకనే నేను బిమల్‌ని గమనించడం మొదలుపెట్టాననిపిస్తోంది. ఇలాంటిప్రశ్నలు ఓ పక్కన వేసుకుంటూనే మరోవైపు నేను బిమల్‌పట్ల మెత్తబడుతున్నానా-? నా గమనింపూ నా ప్రశ్నలూ అందులోని మెట్లా-? కాని పర్యవసానమేనా ఇందాకటి నా వివశత్వం-?

మధూ! ఇలాంటిస్థితిలో నేను మామ్‌కథ ఒకటి చదివాను. ఆమె ప్రాశ్చాత్య వనిత. ఆమె భర్తకూడా బిమల్ చేసినపనే చేస్తాడు. ఎంతోనేర్పరితనంగా రచయిత ఆమె భర్త ఎలాంటి పరిస్థితుల్లో కొన్నేళ్ళు ఓ అడమనిషితో కాపురం చెయ్యాల్సి వచ్చిందో చెపుతాడు. చివరకి ఆమె వేరవుతుంది. అతను పాతమనిషిని తిరిగి పిలుస్తాడు.

ఇప్పుడే యీ కథ పూర్తిచేసాను.

అచ్చులో మనుషులు- జీవితంలో మనుషులకు ఎదురయినే సమస్య- తమ జీవితాల్లో వాస్తవంగా లేనపుడే- వాస్తవమైన మనుషు ఆ సమస్యను తమఊహాల్లో

ఎదుర్కొని ఆ పరిష్కారాన్ని పసిగట్టలేనని యిప్పుడు నాకు తోస్తోంది.

"నేనేం చెయ్యాలి?" అన్నదానికి రెడిమేడ్ సమాధానమూ, పరిష్కారమూ నాకాకథలో ఉంది. అయితే "నేనేం చెయ్యగలను?" అన్న ప్రశ్న ఒకటి ముందుగా మొదలై నాలో నలుగుతూందని యిప్పుడే నాకు స్పష్టం అయింది. ఇంతవరకూ యిది నాకు స్పష్టం కాకపోవటానికి కారణం ఏమిటి? బహుశా నన్ను నేనంత అసహాయురాలిగా చూడటానికి నా మనసు యిష్టపడలేదనుకుంటాను.

ఈ క్షణంలో అన్ని కోణాలనుంచీ ఆలోచించే శక్తి ఏదో నాకు కొత్తగా లభించిందనిపిస్తోంది. నా విజన్ పెరిగిందని తోస్తోంది. దీన్ని నేను ఎవరితోనయినా పంచుకోవాలనిపించింది.

దీన్ని కష్టమనటానికీ- నాకు తీవ్రమయిన నష్టమనటానికీ- మనసు నేరుగా ఒప్పుకోటం లేదు. కష్టాలను యితరులతో పంచుకోటం అసహాయుల పని అనే తక్కువచూపూ ఉంది. 'ఆలోచనలు' పంచుకోవాల్సిన అవసరంతో యిదంతా రాయాలనుకున్నపుడు- నువ్వు నా ముందున్నావు-

అందుకే రాస్తున్నాను-

"నేనేం చెయ్యగలను-?" అన్న ప్రశ్నలో "నేను" అన్నచోట- "భారతీయ స్త్రీ" "చదువులేని స్త్రీ" "చదువుకున్న స్త్రీ" "ఆస్తిలేని స్త్రీ" "ఆస్తిఉన్న స్త్రీ" "ఉద్యోగం ఉన్న స్త్రీ" "ఉద్యోగావకాశమున్న స్త్రీ" "ఆడపిల్లల నిర్ణయాలను గౌరవించే తలిదండ్రులున్న స్త్రీ-" "అలా గౌరవించక వాళ్ళను పరాయిగా భావించే తలిదండ్రులున్న స్త్రీ" "పట్నం స్త్రీ" "గ్రామం స్త్రీ" "-ఒక్కొక్కకులం స్త్రీ" "ఒక్కో మతం స్త్రీ" "ఒక్కో వయసు స్త్రీ" ని గురించి ఆలోచించు!

ఎవరి అసహాయత ఎలాంటిదో తెలుస్తుంది- స్త్రీ బ్రతుకులోని ఈ అసహాయత భావనపోతేతప్ప- ఆమె క్షమ క్షమాకాదూ! ఆమె ప్రేమ ప్రేమాకాదు! ఆమె వివేచన వివేచనా కాదు!

కథలనీ పాత్రలనీ సృష్టించేవాళ్ళు ఏ పరిష్కారమైనా చాలా సులువుగా యిచ్చెయ్యవచ్చు కాని మనం యివ్వగలమా?

అందుకే-

"నేనేం చెయ్యగలను-!" అన్నది "నేనేదయినా చెయ్యగలను-" గా మారిపోయింది

నువ్వేమంటావ్ మధూ?

సీ

రామ్‌ప్యారీ.

ఆ ఉత్తరం పూర్తిచేసాక రామ్‌ప్యారీ- అలాగే కూర్చుండిపోయింది

కవరులోఉంచి అంటించి అడ్రెసురాసి డైనింగ్ టేబిల్‌మీద ఉంచి వెళ్ళిపడుకుంది గంటపోయాకవచ్చి దాన్ని డైనింగ్ టేబిల్‌మీంచి తీసి ఓ పుస్తకంలో ఉంచి

షెల్ఫ్‌లో ఉంచింది.

ఆ తర్వాత- ఆమె నిద్రపోయింది.

మర్నాడు పనిగట్టుకుని లేచి ఆ కవరుని పోస్ట్ చేయమని అతనికి యిచ్చింది.

పదిగంటల ప్రాంతంలో చౌకీదారుని వెంటబెట్టుకుని ఆ గుడిసెకు వెళ్ళింది. ఈ మారు ముసిలాడినించి ఆవాసన లేదు. అంత వంగిలేదు.

ఆమె యింట్లోలేదు.

భయట పంచలో వేసిన చాపమీద కూర్చుంది ప్యారీ. దగ్గరదగ్గరగా ఉన్న యిళ్ళు. పచ్చమన్ను మెత్తిన గోడలమీదా నేలమీదా కొన్ని యిళ్ళకు ముగ్గులున్నాయి. కొన్ని యిళ్ళు అపరిశుభ్రంగా ఉన్నాయి. పందులున్న యిళ్ళముందు మధ్యలో దొలచబడిన తాటిదుంగలున్నాయి వాటి నుంచి దుర్భరమైన వాసన వస్తోంది అదే మిటో ఆమె చౌకీదారునించి గ్రహించింది. బెల్లం రసంలోని తేప! చాలామంది పిల్లలకు బట్టలులేవు. కొన్ని గుళ్ళు వింతజంతువులా ఆమెను చూస్తున్నారు. ఓ కుర్రాడిని- ఆమె పిలిచింది. వాడినడక ఆమెకు నచ్చింది. వచ్చి ఆమెవళ్ళో కూర్చున్నాడు,

పావుగంటలో ఆమె వాళ్ళతో గోళీలు ఆడటోయింది.

ఈలోగా ముసిలాడు కూతుర్ని తెచ్చాడు.

ఓ పావుగంట ఆమె రాకను పట్టించుకోనట్టు అటుమాడలేదు.

ఆ తర్వాత ఆమె సమీపంగా వెళ్ళి- భుజంమీద చెయ్యివేసి- నవ్వింది."

"రేపట్నుంచి బంగ్లాకిరా! పని చేసుకొందువుగాని-" అంది.

ఆమెకు కొంచెం అర్థమయింది చౌకీదారు అనువదించాడు

ఆమె జవాబిచ్చేలోగానే ముసిలాడు వచ్చి దణ్ణాలుపెడుతూ- "నెంకి వంద యివ్వాలి. తిండీ బట్టా పెట్టాలి దానికి-" అన్నాడు

ప్యారీ తలూపింది. ఆ తర్వాత బంగ్లాకు వచ్చేసింది.

బంగ్లాలో వచ్చిన మార్పు గురించి రెండురోజులవరకూ విమల్ ప్రస్తావించ లేదు.

ఆ ఉదయం బ్రేక్‌ఫాస్ట్ దగ్గర అన్నాడు-

"ప్యారీ! మోడీదంపతులు వస్తున్నారు-"

"ఎప్పుడూ...? రామ్‌ప్యారీ.

పార్వతికి నాల్గురోజులు సెలవు యిచ్చి పంపుదామా?"

"ప్యారీ అతని మొహంలోకి విచిత్రంగా చూసింది.

"మా విషయం మోడీకి తెల్సు!"

"తెలిస్తే ?" ఆమెగొంతులో దాచుకుందామనుకున్న కాఠిన్యత ఉంది పార్వతి లోపల్నుంచి పాలగ్లాసులు తెచ్చింది. యిద్దరిముందూ చెరొకటి పెట్టింది.

"పార్వతీ " పిలిచింది ప్యారీ.

వెళ్ళిపోతున్న ఆమె ఆగింది.

"రేపట్నుంచి నాలుగురోజులు నీకు సెలవు-" అంటూ లెక్కపెట్టి "బుధ

వారం రా-" అంది. పార్వతికి ఆమెభాష బోధపడలేదు. ప్యారీ - "నువ్వు వెళ్ళు-" అన్నట్టు సౌంజ్ఞ చేసింది. ఆమె కదిలింది ఇంతలో ఆమె కొడుకు పరుగెత్తుకుంటూ వచ్చాడు. వాడి చెయ్యి తగిలి పాలగ్లాసు కింద పడిపోయింది. ఆ ముక్కలమీద కాలువేసి పరుగెత్తబోయాడు. పెద్దగా ఏడుపు మొదలెట్టాడు.

బిమల్ చకమంటూ ఆ కుర్రాడిని ఎత్తుకున్నాడు.

దూదీ, టించర్ అయొడిన్‌తో ప్యారీ వచ్చేసరికి- బిమల్ ఆ కుర్రాడిని కుర్చీలో కూర్చోబెట్టాడు అతను నీళ్ళుపోస్తుంటే పార్వతి కడుగుతోంది. అతని మొహంలో ఆదుర్దా గమనించిన ప్యారీ- ఆ ఆదుర్దా తనని యిబ్బంది పెడుతూందని గ్రహించింది.

కొడుకుని ఎత్తుకుని పార్వతి వెళ్ళిపోయింది.

చిట్టిలు పూర్చుకున్నాడు బిమల్.

"మోడీదంపతులను ఆహ్వానించేముందు నీకు చెబుతాను-" అని... "ఈ రాత్రి పైడిపాలలో తీర్థానికి వెళ్దామా? కాగడాలతో కొండజనం కొండలమీంచి దిగి రావటం చూట్టానికి చాలా బావుంటుంది-"

"కొంచెం దూరం సర్దాగా నడవొచ్చు-" అన్నాడు.

సాయంత్రం అతను తిరిగి వచ్చేసరికి ప్యారీ తయారుగా ఉంది.

పదిమైళ్ళవరకూ జీపు వెళ్ళింది. అక్కడనుంచి రెండుమైళ్ళనడక. రంగయ్య ముందునడుస్తున్నాడు. తీర్థం ప్యారీకి నచ్చింది. ఖర్జూరం తింది వ్యాపారస్తులంతా వాళ్ళకు చాలా మర్యాద చేసారు. గిరిజనులు వింతగా చూసారు ఆ హడావుడి, నడక అలసట, గాలి ఆమె మనస్థితిని సడలించాయి.

రంగయ్యను వదిలి జీపు ఇంటిమొహం పట్టింది

చలిగాలి తెలుస్తోంది. నడిచిపోతూన్న జనం రోడ్డుమీద అవుపిస్తూనేఉన్నారు. ప్యారీ సీటుమీద తలవాల్చింది. అయిదుమైళ్ళు దాటాక రోడ్డుమీద జనంలేకపోటాన్ని గమనించాడు బిమల్.

ప్యారీ!"

జవాబురాలేదు.

జీప్‌ని ఆపాడు. ప్యారీ బుగ్గమీద వేళ్ళు ఉంచాడు. ఆమెనుంచి ప్రతిస్పందన లేదు.

నక్షత్రాలు, చీకటి, చుట్టూ అడివి. జీప్ అయిడిలింగ్ శబ్దం తప్ప మరేమీ లేదు. బిమల్ మరికాస్త ముందుకెళ్ళి రెండు బుగ్గలమీదా చేతులుంచాడు తన చేతి కింద ఆమెలో కదలికలు అతనికి అర్థమవుతున్నాయి. ఆమె శరీరం అతనికి ఆహ్వాన పత్రంలా అవుపిస్తోంది. ఆ శరీరం లోపలి హృదయం గురించి అతనికి బెంగఉంది. శరీరం హృదయాన్ని జయించే అదను ఉంటుందనే అతని నమ్మకం. స్త్రీ శరీరం భౌతికంగా యిచ్చే ఆనందం అతనికి బాగానే తెల్సు, అది మానసికంగా యిచ్చే

ఆనందం పట్ల అతనివన్నీ యింతవరకూ ఊహలే!

అయిదు నిమిషాల తర్వాత ప్యారీ మృదువుగా అంది.

"నీకు యింతధైర్యం ఉంటుందని నేను అనుకోలేదు ..."

ఆ మాట బిమల్‌కి అర్థంకాలేదు. అతను ఊహించిన మాటల లిస్టులో ఆ వాక్యం లేదు. ఆగొంతు మృదువుగా వినిపించినా అతనికి కఠినంగా తాకింది.

పెదాలను బిగించి జీప్ కదిలించాడు.

బంగ్లాకు వాళ్ళు చేరేసరికి పార్వతి కనిపెట్టుకుని ఉంది.

రెండురోజులు గడిచిపోయాయి. వెనకవేపు వరండాలో ఓ పుస్తకంతో కూర్చుంది. ఆమె సర్వాంగాలూ చెవులుగా మారి పార్వతి గాజుల చప్పుడు మీదే ఉన్నాయి. అన్నీ సర్దేసింది కాబోలు. కొంతసేపటికి ఆ చప్పుడు ఆగిపోయింది. బిమల్ అలికిడి కూడా లేదు.

లేచివెళ్ళి బిమల్‌ను గమనించాలన్న ఆలోచన ఆమెలో ఆడుతోంది. సంస్కారమని ఆమె భావించే దేదో ఆమెను కదలనీయటం లేదు

చివరకు ఆమె లేచింది ఓ అడుగు అటు వేసింది.

బిమల్ ద్వారంలోంచి ఎదుటపడ్డాడు.

తప్పుచేసినదాన్లా కంగారుగా వెళ్ళి తన కుర్చీలో జారబడింది.

బిమల్ ఆమె దగ్గరగా నిలబడ్డాడు.

"—ప్యారీ! నన్ను మన్నించు—"

దాదాపు ఓ గంటదాకా ఆమె ఒక్క వాక్యం దాటలేదు గట్టిగానే ప్రయత్నించింది. చివరకి పుస్తకం పక్కనపెట్టి కాగితాలు అందుకుంది.

మధూ!

పార్వతిని నేను యింటికి తెచ్చాను.

వయసులో నాకన్నా ఆమె చిన్నదే అయుంటుంది నేను యింకా పోస్టు గ్రాడ్యుయేట్ చేస్తూండగా ఈమె యిక్కడ పురుషుడిని చదివేసి ఉందనుకుంటాను. స్త్రీ శరీరంలో పురుషుణ్ణి ఆకట్టుకునే దేమిటి? మగ దృష్టిని అర్థం చేసుకోడం స్త్రీగా నాకు అసాధ్యం కావచ్చు 'మగదృష్టి' గా పత్రికలూ సాహిత్యమూ అందిస్తున్న సమాచారాన్ని బట్టి 'స్తనాలు' ఆకట్టుకుంటాయను కుంటాను. ఆ విషయకంగా నాకన్నా ఎక్కువగా మగవాడిని ఆకర్షించగలదని పిస్తోంది

నన్ను ఆమెపక్కన నించోబెట్టుకోడం నాకు తక్కువతనంగా ఉంది. అయినా బిమల్‌ని పరీక్ష పెట్టడానికి నా హృదయం మొగ్గు చూపించింది.

అది ఏ పరీక్ష?

ఈ పరీక్షయొక్క స్వరూపాన్ని నేను ఆదిలో చర్చించలేదు. ఏమిటాపరీక్ష? అంటూ చర్చించదలచుకుంటే— అది నాకా- బిమల్‌కా- అన్న ప్రశ్నగా మారిపోతోంది.

నాకే అయితే-? ఊహల్లో ఆమెనూ అతన్నీ సమీపంగా చిత్రించి దాన్ని

సహించలేక పోయాను గదా- వాస్తవంలో భరించగలనా? వాస్తవంలో భరించగలిగేట్టు నా సంస్కారం నన్ను అదుపులో పెట్టిందనుకో- ఊహల్లోని దుఃఖాన్ని అధిగమించగలను గదా-" అందువలన భరించగలనా లేదా అన్న పరీక్ష నాకు నేను చేసుకుంటున్నానా?

విమల్‌కే అయితే-? మా యిద్దరిలో అతను ఎవరికి ఎక్కువ ప్రాముఖ్యతను యిస్తున్నాడూ?" ఇది తేల్చుకోటానికే ఈ ప్రశ్న అన్పిస్తోంది.

ఆమెకు అతను ప్రాధాన్యతనీయగలడని నాకు ఎలా అన్పిస్తోందో నాకే తెలీటం లేదు. ఎన్నివిధాలుగా ఆలోచించానో చెప్పలేను. ఆమె నాకన్నా శారీరకోద్రేకం కలిగించవచ్చు. అయినా నాకన్నా ప్రాముఖ్యతను ఆమెకు యీయగలడా? ఇవ్వలేడనే నా వివేచన చెపుతోంది. నేను పోగొట్టుకున్నదీ- తిరిగి ఏ ప్రయత్నం చేసి పొందలేనిదీ- ఏదో అమూల్యవస్తువుకోసం తెలిసి తెలిసి పూర్తిగా వ్యర్థప్రయత్నాలు చేస్తున్నానన్న భావన- నా శరీరాంగాలను చచ్చుబరుస్తోంది. నా మెదడుకు పక్షవాతం సోకినట్టు అనిపింపజేస్తోంది.

ఏమిటా అమూల్యవస్తువు? ఎందుకంత అమూల్యవస్తువయింది?

ప్రశ్నలు వేసుకోటంద్వారా జవాబులు పోగేసుకోటంద్వారా ఆ అమూల్యవస్తువుకి ఆకారం కల్పించాలనీ ఓ మూల్యం సృష్టించాలనీ- ప్రయత్నం. తద్వారా ఆ [illegible] ఉండాలన్న స్పృహ! స్పృహతో చేసేదానికీ- స్పృహకు అందకుండా జరిగేదానికీ- పొంతన ఎక్కడుంది?

విమల్‌కి యిలాంటి పరీక్షను ఒకదాన్ని నేను పెట్టాక- ఆ పరీక్షలో ఏ జవాబునిస్తే అతను నెగ్గుతాడో- ముందుగానే నేను నిర్ణయించుకోవాలి గదా- అందుకు నేను చాలా ప్రయత్నించాను. ఆమె వెనక వెనకే తిరగకపోతే నెగ్గినట్టా-? ఎదురుగా ఉన్నా ఆమెవేపు అతనిచూపులు కదలకపోతే నెగ్గినట్టా-? కదిలినా వాటిలో 'వాసన' లేకపోతే నెగ్గినట్టా-? 'వాసన' ఉన్నా దానినతను చర్యగా మారకుండా అదుపులో ఉంచుకుంటే నెగ్గినట్టా-?

-ఏంచేసినా అతను నెగ్గడు.

అతని గెలుపుకీ యీపరీక్షకూ సంబంధమేలేదు. అతను నెగ్గాలీ అంతే- నా మనసు అతను నెగ్గాలని బలంగా కోరుకోవాలి. ఆ కోరికద్వారా- బలవత్తరమైన ఆ కోరికద్వారా అతను నెగ్గాడన్న భావనా సౌధాన్ని నా మనసే నిర్మించుకోవాలి. అది గాలిమేడో- నీటిమేడో- వాస్తవమయిన పునాదులమీద ఏర్పడిన మేడో- ఏదయినా సరే! అది నా మనసు స్వతంత్ర నిర్మాణమే కావాలి.

స్పృహలో ఉండే మనసు పేర్చే ఆలోచనలకు- స్పృహలో లేని మనసు పొందే అనుభూతులే పునాది. స్పృహలో లేని మనసు ఆడించే, ఆడే నాటకాన్ని నేను ఎలా గమనించగలను? గమనించటానికి మన స్తత్వంమీదనే చదువుకున్న పుస్తకాలు ఎంతవరకూ ఉపయోగపడతాయి-? గమనించినా ఆ నాటకాన్ని మార్చే శక్తి నాకు ఎలా వస్తుంది-?"

అక్కడిదాకా రాసింది ప్యారీ.

గొప్ప నిస్సత్తువుగా అనిపించిందామెకు. మంచినీళ్ళకోసం లేచి హాల్లోకి వచ్చింది. హాలంతా నిద్రపోతున్నట్టుగా ఉంది. అన్నివస్తువులూ వాటిలోకి అవి ముడుచుకుని మునగదీసుకుని పడుకుని ఉన్నట్టున్నాయి. బిమల్ గదిలోంచి నీలి కాంతి. అటు నడిచింది.

వింతజబ్బుతో పుట్టిన బిడ్డను శాస్త్రీయంగా పరిశీలించాలని నిశ్చయించుకున్న తండ్రి మనసులా ఉంది ప్యారీ హృదయం.

బిమల్‌ను చూస్తూ నిలబడింది.

కొంతసేపటికి ప్యారీకి తాను బిమల్‌ను చూస్తున్నదో- తనని తానే చూసుకుంటున్నదో అర్థంకాలేదు. ఇద్దర్నీ కలిపి చూడటంతో- ఆరోజే కొన్ని గంటల్రికితం చలిగాలిలో జీప్‌లో ఆబిమలే తనకు దగ్గరగా వెచ్చగా ఉండటం గుర్తువచ్చింది.

అలా ఉండేముందు- ఆమె అతన్ని ఉద్రేకపరుస్తున్నాననే అనుకుంది. అలా అతను ఉద్రేకపడ్డాక- అతనికి శారీరకావసరం పెరుగుతుందనే అనుకుంది. అలా పెరిగాక- అతన్ని తను నివారించగలననీ నివారించాలనీ అనుకుంది. అలా వారించాక- తీరనికోరికతో ఉన్న అతను బంగ్లాకు వచ్చేసరికి పార్వతిమీద కోరికను దాచుకోలేక పోతాడనీ దాంతో అతని వాస్తవరూపం తెల్సిపోతుందనీ అనుకుంది.

అయితే- ఆమె అనుకున్నట్టు జరగలేదు.

అతన్ని ఉద్రేకపరచటంలో తానూ ఉద్రేకపడిందని గ్రహించటానికి- అయిదు నిమిషాలు పట్టింది. ఈలోగా అతనూ ఉద్రేకపడటం ఆమెకు 'ధైర్యం'గా 'తెగువ'గా అనిపించింది. అప్రయత్నంగా అనేసింది.

"నీకు యింతధైర్యం ఉంటుందని నేను అనుకోలేదు-"

అయితే- అలాంటి ధైర్యాన్ని ఆమె కోరుకుంటున్నదని బిమల్ అనుకోలేదు. ఆ ధైర్యాన్ని ఆమె మృదువుగా ప్రశ్నిస్తున్నదనీ- తన సంస్కార లోపాన్ని ఎత్తి చూపుతున్నదనీ- అతను అనుకున్నాడు. దాంతో అతను చల్లారిపోయాడు. అతను చల్లారాకనే తాను ఉద్రేకపడ్డానన్న వాస్తవం మరింతగా ప్యారీకి అర్థమయింది.

తనకు సంబంధించిన ఆ చేదువాస్తవం- ఆమెను యిబ్బందిపెట్టినా- ఆమె ఉద్రేకాన్ని పూర్తిగా చంపేయలేకపోయింది. అతని ప్రవర్తనలోని సంస్కారాన్ని ఆమె గుర్తించింది. ఆ సంస్కారానికి కారణం తనంటే ఉన్న భయమేనా? తనలోని అయిష్టం పెరిగి తాను దూరమవుతానన్న భయమే -అని తోచింది. ఆ భయానికి కారణం అతనికి తనమీదున్న ప్రేమ- అనీ తోచింది. అలా అతనికి అనుకూలంగా భావించటం వల్ల- తనలో ఆమెకు చాలా లోపాలు కనిపించాయి. ఆ లోపాలు సరిదిద్దుకుందుకూ సంస్కారయుతంగా ప్రవర్తించేందుకూ భర్తనీ పార్వతినీ డైనింగ్ హాల్లో వదిలేసి వరండాలోకిపోయింది. తిరిగి వాళ్ళదగ్గరకు పోకుండా ఉండేటందుకు ఆమె చాలా ప్రయత్నించవలసివచ్చింది చివరకు ఓడిపోయింది. ఆ ఓటమి ఆమెకు

బాలా దుఃఖం యిచ్చింది. అలాంటి దుఃఖంలో వచ్చి బిమల్ 'సారీ' చెప్పాడు. గాయంమీద ఉప్పుపూసినట్టయింది. అప్పుడు ఆ ఉత్తరాన్ని రాసింది ప్యారీ.

తద్వారా తనని తను సమర్థించుకోవాలని ఆమె యత్నించింది. కాని ఫలించలేదు.

అంతేకాని-

తనలో కలిగిన ఉద్రేకమే- అది యింకా జీవించి ఉండటమే- తన మనస్థితి ని అతనికి అనుకూలమైన భావనల్లోకి నెడుతున్నదనీ- అందుకోసమే తప్పుతనదే అని పింప జేస్తున్నదనీ- ప్యారీ గ్రహించలేదు.

నీలిరంగు కాంతిలో- వాతావరణంలోని- తడిని పీల్చుకుని విశాలమయిన ఆ మెత్తని పరుపు చల్లగా మారిపోగా- ఒంటరిగా ఉన్న ఆ మగశరీరం వెచ్చదనం కోసం దుప్పటి కింద బిగుసుకుని పడుకుని ఉండగా- పసితనాల నిష్కల్మషాలా యవ్వనపు నిషాలా ఆ ముహంలో పడుగు పేకల్లా అల్లుకుపోయి కనిపిస్తూండగా -అవన్నీ ప్యారీని 'రారా' అని పిలుస్తున్నట్టూ, నీ తప్పుల్ని మేం భరిస్తాంలే అని హామీ యిస్తున్నట్టూ- స్నేహంతో చూస్తున్నట్టూ, తను ఋజు భావాలకి విలువీయకుండా ఆమె ఋజుభావాలకోసమే వాటికి అనుకరణగానే ఊపిరి పీలుస్తున్నట్టూ-

ఆ వాతావరణమూ... ఆ బిమల్....

ఆమెను తమలోకి లాక్కున్నారు....

ఉద్రేకాల జలపాతంలో ప్యారీ ఉక్కిరి బిక్కిరి అవుతోంది. శరీరంలో నవ నాడులూ ఆవేశాలకు జవజవలాడు తున్నాయి.

అయినా- ఆమె నిగ్రహం పూర్తిగా సడలలేదు ఆమె కరిగి ప్రవహించి ఉరకలెత్తి ముంచెత్తాలంటే ముందుగా ఆమె హృదయం తృప్తి చెందాలి పురుషుడు ఆమె అహాన్ని తృప్తి పరచాలి.

స్త్రీ! నీది పవిత్రమయిన ఉద్రేకం!- నీ ఉద్రేకానికి పశువుల్లో కలిగే ఉద్రేకానికి పోలికేలేదు-! నీవు పాపాలను కడిగే గంగాభవానివి! నీవు ఉద్రేకాల ప్రవాహాలలో స్వర్గానికి దారి చూపేందుకు తేలియాడే కార్తీకదీపానివి! ఉద్రేకపు వేడితో కరిగి సమస్త ప్రపంచానికీ దాహం తీర్చటానికి అనురాగపునదిగామారే హిమవత్పర్వాతానివి! నీ వెక్కడ? నేనెక్కడ-?- అంటూ ఆమె చుట్టూ కట్టుకున్న ఒక్కొక్క పొరనీ వలిచి, ఆమెను సంపూర్తిగా నగ్నం చేసి, ఆమెనో దేవాలయంగా మార్చి, శారీరకమైన మానసికమైన మలినామలినాలను మర్చి ఆమెలో తపస్సుచేయాలి! అది అప్పటి ప్యారీ అవసరం!

ఆ అవసరాన్ని గుర్తించలేదు బిమల్!

వేదన పొరలలో ఏ ఒక్కదాన్నీ వలవకుండానే- కనీసం వాటి ఉనికినైనా గుర్తించకుండానే- సరాసరిగా- ఆమె ఉద్రేకపు అగ్నినే తాకాడు బిమల్! కుదిపాడు బిమల్! ఆమెది ఓటమి కానే కాదు- గెలుపే అని నమ్మించలేకపోయాడు బిమల్! పదిరోజుల ఆకలిలో ఉన్న బిమల్- ఆమెను శారీరకంగానైనా జయించలేకపోయాడు.

ఆ తర్వాత అతను దాదాపు నగ్నంగా తన మంచం మీద గుర్రుకొట్టడం మొదలు పెట్టాడు.

బెడ్‌రూమ్ లైట్‌కూడా ఆర్పేసింది ప్యారీ.

బట్టలు కట్టుకుని వెళ్ళి వరండాలో పడకకుర్చీలో కూర్చుంది.

బయటకు చూసింది.

వెదురు ఫెన్సింగ్‌మీద ఆకాశం నల్లగా భయంకరంగా ఉంది.. నిద్రగన్నేరు చెట్లమీద నిశ్శబ్దపుశబ్దం నిద్దట్లోంచి లేచినట్టుంది. చుక్కలు చిన్నవై పోయి లయమై పోతున్నట్టున్నాయి. దూరంగా లాకులమీంచి నీరుపడుతున్న చప్పుడు ఓ మారు గాలివాటుకు వినిపిస్తోంది మాయమైపోతోంది.

ఏ ఆలోచనలూ లేనిస్థితిలో ఉన్నానన్న విషయం గమనించటానికి ప్యారీకి నలభై నిమిషాలకుపైగా పట్టింది. ఎంతో బేలగా దీనంగా యీ నికృష్ట శరీరం కోసం తాను ప్రవర్తించినట్లు ఆమెకు అనిపించుతోంది. ఆ భావనకు ఆమె పేరు వెదుక్కోడంతో ఆమె ఆలోచను మొదలయాయి 'జుగుప్స' అన్న పేరు తట్టింది.

శరీరాన్ని స్వయంగా తగలెట్టేసుకుంటూంటే-

యీ శరీరమే సాధనంగా పొందిన సుఖాలన్నింటిపట్లా ఒక్కమారుగా కోరిక విజృంభించి- 'అయ్యో! అయ్యో!' అంటూ వెర్రిగా గెంతులేస్తున్నట్టై-

ప్యారీ నిశ్శబ్దంగా ఏడవటం మొదలు పెట్టింది.

మానవ ప్రాణికి ఆకలి ఆలివంటిది. నిద్ర తల్లి వంటిది.

రెండురోజుల తర్వాత మోడీ దంపతులు వచ్చారు.

బిమల్ ఉషారుగా ఉన్నాడు. తమ యిద్దరికీ రెండ్రోజులక్రితం కుదిరినది సంధి కాదనీ, ప్యారీ మారలేదనీ గమనించినట్టే లేడు.

మిస్టర్ మోడీ అన్నాడు-

"దారాలమ్మ లోవలకు వెళ్దాం-"

అంటూనే భార్యవయిపు చూస్తూ-

"ఈమెకు అలాంటివంటే గొప్పపిచ్చి. పదిహేనేళ్ళయి పెళ్ళయి నేను చెయ్య లేనిపని ఏ దేవుడయినా చేస్తాడనే ఈవిడ నమ్మకం-"

ఆమాటల్లో జోకు మొరటుగా తోచింది ప్యారీకి.

బిమల్ అతని కాలుగట్టిగా తొక్కాడు.

అతను బిగ్గరగా నవ్వుతూ-

"ప్యారీ కాలనుకున్నావా నెమ్మదిగా తొక్కుతున్నావ్? నువ్వు పిచ్చోడి లాగు న్నావే- ఉన్నమాటంటే ఆడాళ్ళు ఉడుక్కుంటార్లే- అందుకోసం మనం నోరుకట్టేసు కుంటామా-?"

మిసెస్ మోడీ అంత చదువుకోలేదు

ప్యారీ చీరలగురించీ పుట్టింటి సంపదలగురించీ అదేపనిగా అడిగింది ప్యారీకి

అలాంటివి నచ్చవు. అయినా జవాబులు యిచ్చింది.

మిస్టర్ మోడీమీద ప్యారీకి అసహ్యం కలిగింది.

అతను కాకినాడలో ఉంటున్నాడు. బిమల్‌తో ఎప్పట్నించి పరిచయమో ఎలాంటి పరిచయమో ప్యారీకి తెలీదు. ఏమయినా అది ఎక్కువేనని ఆమె గ్రహించింది. మిస్టర్ మోడీ లాంటి మనుషులవల్లనే బిమల్‌లాంటి మనుషులు-మనుషులు కాలేక పోతుంటారని పించింది ప్యారీకి.

మర్నాటి ఉదయం జీప్‌లో నలుగురూ జయపుర్ద్రేసరికి పార్వతి తండ్రివచ్చాడు.

మిస్టర్ మోడీని చూస్తూనే దణ్ణం పెట్టాడు.

బిమల్‌వేపు చూస్తూ అదోలా నవ్వుతూ- అయినుమాపాయలనోటు తీసాడు. దాన్ని గొట్టంలా చుట్టి సన్నగాచేసి చెవిలోదూర్చి గులిమి తీసాడు. దాన్ని అతనికి దూరంగా వేసాడు. హిస్టీరియస్‌గా నవ్వటం మొదలు పెట్టాడు. ఘుసిలి అతను నేల మీంచి తీసిదాన్ని పంచెలో నడుం దగ్గర దాచాడు.

"ఎందుకలా నవ్వుతారూ-?" పార్వతిగొంతు సర్కాస్టిక్‌గాఉంది. నవ్వుతూనే అన్నాడు మోడీ!

"పీడొకుక్క! పీడికోపిల్ల ఉంది- పార్వతని! అదో కుక్కపిల్ల! బలే వుండేదిలే-! ఏపనిచెపితే అదల్లా చేసేది! బలే మంచిది!"

బిమల్ భయం భయంగా ప్యారీవైపు చూసాడు!

ప్యారీ దృష్టి మార్చాలని ఏదో అనబోయాడు బిమల్!

"ఎలావుంది ప్యారీ?" అడిగాడు మోడీ అతన్ని.

అతను చేతులు నలుపుకుంటూ అదోలా నవ్వుతూ-" యిక్కడే పనిచేసుకుంటోంది-"

మోడీ మరింత బిగ్గరగా నవ్వుతూ- "మరేదీ-? కనిపించలేదూ-" అంటూ అటూ యిటూ చూసాడు.

అతని ధోరణి చూస్తూంటే- పార్వతి కనిపిస్తేచాలు మీదపడిపోతాడేమో-అనిపించింది.

ఆ ఊహ ఆమెకు చాలా అసహ్యం కలిగించింది.

తను అంత చవకగా భావించగలనన్న దుఃఖం! అంతటి చవకబారు స్త్రీతో తనభర్త ఉన్నాడన్న దుఃఖం! అలాంటి చవకబారు వ్యక్తి కోసం తను అలాంటి చవకబారు స్త్రీతో పోటీపడ్డానన్నదుఃఖం! అంత చవకబారుగా ప్రవర్తించలేని తను ఆ పోటీలో ఏ విధంగానూ నెగ్గే అవకాశం లేదన్న దుఃఖం!

ఎంత నిగ్రహించు కుందామన్నా ఆమె దాచుకోలేకపోతోంది-

చవకబారు స్త్రీకోసం చవకబారుగా ప్రవర్తించేబిమల్ తనకోసం సంస్కారాన్ని ప్రదర్శించేదంతే!

"ఓ....!" అంటూ అర్థమయినట్టు బిగ్గరగా నవ్వాడు మోడీ! మిసెస్‌మోడీ భుజం చుట్టూ చెయ్యివేసి చెవిలోకివంగి ఏదో అన్నాడు. మిసెస్‌మోడీ కళ్ళలో ప్యారీ

భరించలేనిజాలి.

జీపు కదిలింది.

దారాలమ్మదోవ రెండు కొండలమధ్య ఉంది. అక్కడదాకా జీపు వెళ్ళదు.

దాకలూరులో గ్రామాధికారి యింటిముందు ఆగింది జీపు. పొడవాటి కంచు గ్లాసులో మజ్జిగలుయిచ్చి గౌరవించాడాయన. ఓమనిషిని తోడుగా పంపాడు.

మిసెస్ మోడీకి ఆతోవగురించి చెపుతున్నాడు బిమల్.

అక్కడ పాండవులు ఉండేవారట. అక్కడ ఓ రాతిలో ధర్మరాజువాడిన కత్తి ఉందిట. అది చాలా మహిమ గలదిట. ధర్మరాజు న్యాయనిర్ణయానికి ఆ కత్తి ఉపయోగించేవాడట. దాని అంచును చేతుల్తో పట్టుకుని ఎవరయినా అబద్ధం ఆడితే చేతులు తెగిపోయేవిట. లేకపోతే చిన్న గాటుకూడా పడేది కాదుట. అశ్వత్థామ చనిపోయినట్టుగా అబద్ధం చెప్పిన ధర్మరాజు ఆ కత్తిని ముట్టుకోటానిక్కి భయపడిపోయాట్ట. కృష్ణుడి సలహామీద భీముడు దాన్ని ఆ రాతిలో దింపేసి వెళ్ళిపోయాట్ట. అయినా యిప్పటికీ ఆ కత్తికి శక్తి ఉందని ఆ చుట్టుపక్కల వాడుకలో ఉన్న నమ్మకంట. దానిని ముట్టుకుని ఎవరయినా ఏదయినా కోరుకుందే— అది న్యాయమయిన కోరిక అయితే ఓ ఏడాదిలో నెరవేరుతుందిట. అది అన్యాయమయిన కోరిక అయితే కోరినవాళ్ళు ఏడాది తిరక్కుండా రక్తం కక్కుకుని చనిపోతారుట.

అంత ఆసక్తి చూపకుండానే అంతావింది ప్యారీ.

తోవలో ప్రకృతి సౌందర్యం చాలా బాగుంది.

తోడొచ్చిన మనిషిద్వారా చెట్టుమీంచి కల్లు దింపించాడు మోడీ. అది అయ్యాక మగవాళ్ళిద్దరూ చెరువులో యీతకు దిగారు.

సాయం వచ్చిన మనిషితో ఆడవాళ్ళు దారాలమ్మ విగ్రహం దగ్గరకువెళ్ళారు.

వాస్తవానికి అది విగ్రహంలా లేదు. పెద్ద రాయిలా ఉంది. చూడగా చూడగా అది మనిషి ముహంలా అవుపిస్తోంది. దాని పైభాగంలో కుంకం మెత్తివుంది. రెండు పక్కలా పసుపు ముద్దలు ఉన్నాయి. ముందున్న బండరాళ్ళమీద కోడియీకలూ రక్తం చారికలూ కనబడుతున్నాయి.

మిసెస్ మోడీ మతంలో అగ్నే దేవుడు.

అయినా ఆమె హిందూ దేవుళ్ళందరికీ దండాలు పెడుతుంది. ప్రార్థిస్తుంది. తిరపతీ, పుట్టపర్తి రెగ్యులర్‌గా వెళ్తుంది.

ప్యారీకి దేవుడిగురించి చాలా ఆలోచనలున్నాయి.

దేవుడిని నమ్మేవాళ్ళంటే ఆమెకు చిరాకుఉంది. బొమ్మలకు మొక్కేవాళ్ళంటే చిన్నచూపు ఉంది. ఊగిపోతూ భజనలు చేసేవాళ్ళంటే ఆమెకు కంపరం. అయితే ఆమె దేవుడు ఉన్నాడనుకోటాన్ని ఖండించే స్థితిలోనే వుందిగాని లేదని విశ్వసించే స్థితిలోలేదు. ఆ స్థితికి చేరటానిక్కి కావల్సినంత బలంగా ఆలోచించే పరిస్థితి ఆమెకు యింతవరకూ ఎదురవలేదు. నచ్చని మనుషులుచేసే పనులు నచ్చని స్థితిలోనేవుంది.

మిసెస్‌మోడీ దారాలమ్మకు దండం పెడుతుంటే ప్యారీ కూడా పెట్టింది

ఆ తర్వాత వాళ్ళకు భీముడి పాదాలూ ద్రౌపది చీరా చూపించాడామనిషి

మిసెస్‌మోడీకి తెలుగుకొంత అర్థమవుతుంది

ధర్మరాజు కత్తిదగ్గరకు తీసుకెళ్ళాడతను అది కత్తిలా చెక్కబడినరాయి దాని చుట్టూ ముమ్మారు తిరిగి దణ్ణంపెట్టి దాన్ని పట్టుకోమన్నాడు అతను

ముందుమోడీ పట్టుకుంది

తర్వాతదాన్ని ప్యారీ పట్టుకుంది

అప్పటికే ఆమె విపరీతంగా వణికి పోతోంది శరీరమంతా ఓ పెనుకోరికలో మాంపోయివుంది ముమ్మారు తిరిగి తనచేతినిసాచి ఆ రాతిమీద ఉంచింది

చల్లని ఆ రాయి జివ్వున లాగుతోంది

వణికిపోతూన్న చేతుల్తో మనసుతో బాధతో ఆ రాతికత్తిని బలంగా నొక్కుతూ అనుకుంది ప్యారీ!

"నాది చాలా న్యాయమయిన కోరిక! బిమల్ సంస్కారాన్నేకాదు- బిమల్‌ని కూడా చంపెయ్ ●